క్లుప్తంగా

ఉప నదులకు జలకళ



నందిగామ: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా ఉపనదులకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో వైరా, కట్టలేరు, మున్నేరు నదులు జలకళను సంతరించుకున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో శనివారం మండలంలోని దాములూరు కూడలి వద్ద వైరా నదిపై గల కాజ్‌వేపై నుంచి వరద నీరు ప్రవహించాయి. ఈ నేపథ్యంలో ఆ మార్గంలో ఆదివారం మధ్యాహ్నం వరకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సాయంత్రం నుంచి వరద నీరు కాస్త తగ్గుముఖం పట్టడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి.

అన్నదానానికి విరాళం అందజేత



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం హైదరాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన అరిగెల రమేష్ అనే భక్తుడు ఏ.పవన్ శ్రీనివాస్ పేరుమీద రూ.50,116 ఆలయ ఇన్‌స్పెక్టర్ బద్దుల కృష్ణప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఖమ్మం పట్టణానికి చెందిన సింగంశెట్టి రాజకుమార్ రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

రచయిత సోనీకి ఉగాది పురస్కారం



కంచికచర్ల: పట్టణానికి చెందిన ప్రముఖ కవి, రచయిత, బహుజనుల రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోనీ ఉగాది కవితా పురస్కారం అందుకున్నారు. గుంటూరులో సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనంలో ఈ పురస్కారం లభించింది. సోనీని ఘనంగా సత్కరించి, ఉగాది కవితా పురస్కారాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు పాపినేని శివశంకర్ అందజేశారు. కవి, రచయిత సోనీకి ఉగాది కవితా పురస్కారం రావటం అభినందనీయమని పట్టణ వాసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఎల్‌ఐసీ ఉద్యోగి మృతి



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన ఎల్‌ఐసీ డెవలెప్‌మెంట్ ఆఫీసర్ (డీవో) మెగావత్ ధర్మా (59) రోడ్డు ప్రమాదానికి గురై విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ నెల 17వ తేదీన జగ్గయ్యపేట పట్టణంలోని బుద్ధ విహార్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైన విషయం విదితమే. కాగా విజయవాడలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మృతి చెందాడు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు మన్మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు. ధర్మా మృతి పట్ల బంజారా ఉద్యోగుల సంఘం నాయకులు, ఎల్‌ఐసీ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

లూర్థు మాత ఆలయ ఉత్సవాలు ప్రారంభం

వీరులపాడు: మండలంలోని బోడవాడ, జమ్మవరం విచారణ పరిధిలోని పరిశుద్ధ లూర్థుమాత ఆలయ 74వ వార్షికోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఫాదర్ సాలె వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గ్రామస్తుల సమక్షంలో ఆలయ ప్రాంగణంలో జెండా ప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా చేశారు. ఈ నెల 20, 21 తేదీల్లో కూడా మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 21న విజయవాడ మేత్రాసన బిషప్ తెలగతోటి రాజారావు పాల్గొంటారని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కర్ల రాణి, నాయకులు రాజు, దాసు, గ్రామస్తులు పాల్గొన్నారు.

350 మందికి కంటి వైద్య పరీక్షలు

నందిగామ: పట్టణ శివారు అనాసాగరంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన కనిపించింది. మైత్రి సేవా సమితి, శంకర్ కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో గ్రామంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 350 మందికి వైద్యులు కంటి పరీక్షలు చేశారు. వారిలో 250 మందికి ఆపరేషన్లు అవసరమని సూచించారు. వారందరికీ శంకర్ కంటి ఆస్పత్రి ద్వారా దశలవారీగా ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు నిర్వాహకులు గుండాల బాలాజీ తెలిపారు.

విద్యాదీవెన వరం

- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు
- నందిగామ నియోజకవర్గంలో 3,901 మంది విద్యార్థులు
- 3,513 మంది తల్లుల ఖాతాల్లో రూ.3.32 కోట్లు జమ



నగదు జమైనట్టు వచ్చిన మెసేజ్‌లు చూస్తున్న విద్యార్థినులు (ఫైల్)

కంచికచర్ల: ఉన్నత చదువులే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాదీవెన పథకం నిధులు విడుదల చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఈ నిధులు ఎంతగానో దోహదపడుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. పేద విద్యార్థుల తలరాతలు మార్చాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యాదీవెన వంటి సంక్షేమ పథకం అమలు చేయడం ఎంతో మంచి నిర్ణయమని వారు పేర్కొంటున్నారు. ఈ నిధులను తల్లుల ఖాతాల్లో జయచేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. నందిగామ నియోజకవర్గంలో జగనన్న విద్యాదీవెన అమలు తీరుపై కథనం..

నియోజకవర్గంలో రూ.3.32 కోట్లు జమ..

నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మొత్తం 3,901 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో ఉన్నత చదువులు చదువుతున్నారు. అయితే 3,513 మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.3.32 కోట్లు జమ అయ్యాయని సాంఘిక సంక్షేమ శాఖ అధికారి పీ గోపాలకృష్ణ ఆదివారం తెలిపారు. కంచికచర్ల మండలంలో 1271 మంది విద్యార్థులకు గాను వారి తల్లుల బ్యాంకు ఖాతాలో రూ.1.10 కోట్లు జగనన్న విద్యా దీవెన కింద జమ చేశారు. అదేవిధంగా నందిగామ మండలంలో 742 మంది విద్యార్థులకు గానూ 667 మంది తల్లులకు రూ.66.72 లక్షలు, చందర్లపాడు మండలంలో 1010 మంది విద్యార్థులకు గానూ 901 మంది తల్లులకు రూ.84.66 లక్షలు. వీరులపాడు మండలంలో 878 మంది విద్యార్థులకు గాను 791 మంది తల్లులకు రూ. 77.24 లక్షలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి.

ఒకే కుటుంబంలో..

ఒకే కుటుంబంలో ముగ్గురు విద్యార్థులు వేర్వేరు కోర్సుల్లో కాని, వేర్వేరు కళాశాలలో విద్యనభ్యసిస్తే వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో ముగ్గురు విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం వర్తిస్తుందన్నారు. జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా నిధులు మంజూరు చేయటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారి మాటల్లోనే..

జగనన్నకు రుణపడి ఉంటాం..



మాకు ఇద్దరు కుమార్తెలు. టైలరింగ్ పనిచేసుకుంటూ జీవిస్తున్నాం. మా చిన్న కుమార్తె బీటెక్ సీఎస్‌ఈ చదువుతుంది. అయితే అమ్మాయిలను పైచదువులు చదివించలేనిస్థితి. సీఎం జగన్ విద్యాదీవెన, వసతిదీవెన, ఫీజ్ రీయింబర్స్‌మంట్ పథకాలు అమలు చేసి మాలాంటి పేద వారిని అన్నలా ఆదుకుంటున్నారు. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

–మాతంగి సంధ్యారాణి, విద్యార్థిని తల్లి, గండేపల్లి

జగన్ మామయ్యకు కృతజ్ఞతలు..



బీటెక్ ఐటీ చదువుతున్నాను. మాది చాలా పేద కుటుంబం. మా తల్లిదండ్రులకు ఇద్దరం కుమార్తెలం. జగన్ మామయ్య నా చదువుకు చాలా ఖర్చు చేస్తున్నారు. లేకపోతే చదువును మధ్యలోనే ఆపేసేదాన్ని. సీఎం జగన్ మామయ్యకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు.

–బొక్కా శ్రావణి, బీటెక్ ఐటీ, గండేపల్లి, కంచికచర్ల మండలం

అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు



అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులు

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. సెలవు దినం, పలు శుభకార్యాలు ఉండటంతో పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. భక్తులు అమ్మవారికి పాలు, పొంగళ్లు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి రావటంతో గ్రామంలో ట్రాఫిక్ అవరోధాలు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అమ్మవారిని టీవీ, సినీ నటుడు ఫణి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కల్లాల్లో పంటను కాపాడుకోవాలి

గరికపాడు(జగ్గయ్యపేట): అకాల వర్షాల దృష్ట్యా రైతులు కల్లాల్లోని పంటను కాపాడుకోవాలని కేవీకే కోఆర్డినేటర్ వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. గ్రామ సమీపంలోని కల్లాల్లోని మిర్చి పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా వాతావరణం మార్పుల కారణంగా అకాల వర్షాలు కురుస్తున్నాయని కల్లాల్లోని మిర్చి పంటను కాపాడుకోవాలని తెలిపారు. ముఖ్యంగా మిర్చి తడవకుండా టార్పాలిన్ పట్టాలతో కప్పి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధిక తేమ వల్ల కాయకుళ్లు రావటానికి అవకాశం ఉందని ముందు జాగ్రత్తగా మాంకోజెబ్, క్లోరో అదానిల్, డయాఫినేట్ మితాల్‌ను సంబంధిత పాళ్లలో పిచికారీ చేసుకోవాలని తెలిపారు. వర్షాలు తగ్గిన తరువాత కాయలను వేర్వేరుగా ఎండబెట్టుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

గంజాయి ముఠాలపై కఠిన చర్యలు తీసుకోండి

ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఖాదర్‌బాషా



అవగాహన ప్రదర్శనలో ఖాదర్‌బాషా

వించిపేట(విజయవాడపశ్చిమ): నగరంలో గంజాయి రవాణ, విక్రయాలకు పాల్పడుతున్న ముఠాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో ఆదివారం వించిపేట మహంతిపురంలో గంజాయి వినియోగంపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో స్కూల్స్, కళాశాలల్లో విద్యార్థులు గంజాయికి బానిసలవుతూ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి గంజాయి వినియోగంపై అవగాహన సభలు, సమావేశాలు నిర్వహించి యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) నగర నాయకులు షేక్ అజాజ్, శివ, శంకర్, షేక్ బషీర్, సుబ్రహ్మణ్యం, ఎండీ మక్‌బుల్ తదితరులు పాల్గొన్నారు.

నడకతో అనారోగ్య సమస్యలు దూరం



ఆర్థిక సహాయం అందుకున్న ఉత్తమ పేద విద్యార్థులతో వాకర్స్ ప్రతినిధులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నడకతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, వివిధ ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని వాకర్స్ అసోసియేషన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.పి.రవీంద్ర అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో విజయవాడ వాకర్స్ అసోసియేషన్ 24వ వార్షికోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో న్డో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న ఉత్తమ పేద విద్యార్థులకు ఆర్థికసాయం చేశారు. రవీంద్ర మాట్లాడుతూ దేశ భవిష్యత్‌కు నేటి విద్యార్థులే పునాదని, ఉత్తమ విలువతో విద్యనభ్యసించి ప్రపంచ స్థాయిలో అవకాశాలు అందిపుచ్చుకుని ఉన్నత స్థితికి ఎదగాలన్నారు. నడకతో ఆరోగ్య ప్రయోజనాలు గుర్తించి 32ఏళ్ల క్రితం విశాఖ కేంద్రంగా వాకర్స్ ఇంటర్నేషనల్ ఆవిర్భావం జరిగిందని గుర్తు చేశారు. లయన్స్, రోటరీ వంటి సేవా సంస్థలకు దీటుగా సామాజిక సేవలో నడక సంఘాలు ముందున్నాయన్నారు. విజయవాడ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోటూరి ప్రభాకర్ మాట్లాడుతూ పర్యావరణ, ప్లాస్టిక్ నివారణ, మెడికల్ క్యాంపులు నిర్వహణ వంటి అనేక కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం నడక–ఆరోగ్యం పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో వాకర్స్ జిల్లా అధ్యక్షుడు రామలింగరాజు, వాకర్స్ ప్రతినిధులు సాంబిరెడ్డి, అమరనాథ్, ప్రసాద్, విశ్వేశ్వరరావు, చక్రధర్, చంద్రశేఖర్, రామకృష్ణ, సంజీవరావు పాల్గొన్నారు.

మాతృ ప్రేమ అనంతం

విజయవాడ కల్చరల్: మాతృప్రేమ అనంతమైనదని దానికి పరిమితిలేదని ఆకాశవాణి విశ్రాంత సంచాలకురాలు ముంజులూరి కృష్ణకుమారి అన్నారు. హాస్యానందం మాసపత్రిక దండెరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ హాల్‌లో ఆదివారం సాహితీవేత్త జాంబువతి జ్ఞాపకార్థం గుత్తికొండ లక్ష్మికి బంగారుతల్లి పురస్కారం, హాస్యానందం మాసపత్రిక నిర్వహించిన కథల పోటీ విజేతలు, కార్టూన్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభను నిర్వహించింది. కృష్ణకుమారి మాట్లాడుతూ మాతృదేవోభ అన్న సూక్తిని నిజం చేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న హాస్యానందం నిర్వాహకుడు రాము పండా సేవలను కొనియాడారు. తెలుగు సంస్కృత అకాడమీ సభ్యుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తూ, యువ కథకులను, కార్టూనిస్టులను ప్రోత్సహిస్తున్న హాస్యానందం సంపాదక వర్గాన్నిఅభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు, కార్టూనిస్ట్ బ్నిం, సీనియర్ చిత్రకారుడు ఎవీఎమ్, కార్టూన్ రంగానికి చెందిన కేవీవీ సత్యనారాయణ, దండెంరాజు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ డీఎస్‌వీ రామశర్మ, డాక్టర్ వీవీ రాంకుమార్ పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

నందిగామ: స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని ఆర్డీఓ రవీంద్రరావు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డివిజన్ పరిధిలోని సమస్యలను అర్జీల రూపంలో ఆర్డీఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

కంచికచర్ల : ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి ఆదివారం తెలిపారు. గ్రామాల్లో సమస్యలపై ప్రజలు అర్జీలు ఇస్తే త్వరితగతిన ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని తెలిపారు.

రైతు కూలీ సంఘం మాజీ నేతకు నివాళి

నందిగామ: రైతు కూలీ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మందా జార్జ్ ఏడో వర్ధంతి ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని రైతు కూలీ సంఘ కార్యాలయంలో జార్జ్ చిత్రపటానికి ఆ సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘ నాయకులు ఎం.రాంబాబు, వై.నాగేశ్వరరావు, కోట్యానాయక్, కొండ, స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు ఎం.కోటేశ్వరి, నాగ మల్లేశ్వరి, రాజి తదితరులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో మరిన్ని సేవలు

నందిగామ: అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆ సమితి అధ్యక్షుడు పారేపల్లి సాయిబాబు తెలిపారు. పట్టణంలోని వాసవి అమ్మవారి ఆలయంలో ఆదివారం సేవా సమితి సభ్యుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇప్పటివరకు చేసిన సేవా కార్యక్రమాలు, రాబోయే రోజుల్లో చేపట్టబోయే సేవలపై చర్చించారు. ఈ సమావేశంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

విధిగా హెల్మెట్ ధరించాలి

జుజ్జూరు(వీరులపాడు): ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ సోమేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ఆటోవాలాలు పరిమితి మేరకు మాత్రమే ప్రయాణికులను ఎక్కించాలని ఆయన సూచించారు. పలువురు సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ: పట్టణం, మండల గ్రామాల్లో సోమవారం 6 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ దిబ్బయ్య ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని చందాపురం రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల నేపథ్యంలో మధ్యాహ్నం 12:30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆ సమయంలో పట్టణంలోని సీఎం రోడ్, ముక్కపాటి కాలనీ, రైతు పేట డౌన్, గీతా మందిరం రోడ్డు, పాత కరెంట్ ఆఫీస్ రోడ్డు, గాంధీ సెంటర్, గవర్నమెంట్ హాస్పటల్ రోడ్డు, మండలంలోని చందాపురం, అంబారుపేట, ఐతవరం గ్రామాల్లో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆపరేషన్లకు 30 మంది ఎంపిక

వీరులపాడు: నందిగామ ఐకాన్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వీరులపాడు గ్రామ సచివాలయంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 30 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో వట్టికొండ చంద్రమోహన్, కోడూరి పిచ్చేశ్వరరావు, వైద్యులు నవ్య, రవిరాజ్, గురవయ్య, నాయకులు మందూరి ప్రకాష్, చావా శివాజీ, గోపయ్య, నాయకులు పాల్గొన్నారు.



తిరువూరులో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయ భాను



తిరువూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి శాలువాకప్పి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్

గృహ సారథులకు శిక్షణ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: రానున్న ఎన్నికల్లో పార్టీకి గృహసారథులే మూలస్తంభాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా పేట పట్టణ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ప్రత్యేక శిక్షణా సమావేశం ఆదివారం సాయంత్రం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ 'మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేయడంతో పాటు గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, చేసిన మోసాలు, జగన్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. గతానికి, ఇప్పటికి ఉన్న వ్యత్యాసాలను వివరించాలన్నారు. ఒక్కో గృహ సారథి రోజుకు 10 ఇళ్ల చొప్పున వారానికి 70 పూర్తి చేయాలని తెలిపారు. స్టిక్కర్లు అంటించి ఫొటోలు, వీడియోలు తీసి మీకు ఇచ్చిన ప్రశ్నావళిలోని సమాధానాలు రాబట్టాలని సూచించారు. ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఒకొకరికొకరు సమన్వయం చేసుకుంటూ జగనన్న కుటుంబంలా పనిచేయాలన్నారు. కోట్ల రూపాయల నిధులతో నియోజకవర్గం అభివృద్ధి చేశామని వివరించారు. కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యూత్ అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, ఎన్టీఆర్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నిడముక్కల శంకరావు, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

పిచ్చుకల దినోత్సవంపై అవగాహన



పిచ్చుక చిత్రం చూపిస్తూ అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు ప్రసాద్‌బాబు

జగ్గయ్యపేట అర్బన్: ప్రపంచ పిచ్చుకల దినోత్సవం ఈనెల 20న నిర్వహించనున్న సందర్భంగా ఆదివారం స్థానిక ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పిచ్చుకలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. తిరుమలగిరి ప్రభుత్వ ఉపాధ్యాయుడు టి.ప్రసాద్‌బాబు గీసిన పాబ్లో పికాసో స్టైల్ ఆఫ్ ఆర్ట్ (3డి, 2డి జ్యామితీయ ఆకారాలు, వివిధ రంగులు ఉపయోగించి ఎనలిటికల్ క్యూబిజం)తో గీసిన పిచ్చుక చిత్రాన్ని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు గంధం శేషగిరిరావు ఆవిష్కరించారు. అనంతరం ఉపాధ్యాయుడు ప్రసాద్‌బాబు మాట్లాడుతూ పాబ్లో పికాసో స్టైల్ ఆఫ్ ఆర్ట్ గురించి విద్యార్థులకు వివరించారు. అంతరించి పోతున్న పిచ్చుకల జాతిని మనం ఎలా పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అవి పర్యావరణానికి మేలు చేస్తాయన్నారు. అనంతరం ప్రసాద్‌బాబును ఎంఈవో రవీంద్ర, విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయులు సన్మానించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు షేక్ అబ్బాస్ అలీ, మాదిరాజు కేశవరావు, ఉపాధ్యాయులు పరసా శ్రీనివాసరావు, కరుణాకర్‌రెడ్డి, గురుకుల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జంతువులు, పక్షులకు నీటిని అందించండి



నీటి తొట్టెలను అందజేస్తున్న నిర్వాహకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వేసవిలో జంతువులు, పక్షులకు నీటిని అందించడానికి ప్రతి ఒక్కరూ వీధుల్లో, మేడలపై తొట్టెలు, డబ్బాలను ఏర్పాటు చేయాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఠాగూర్ పేర్కొన్నారు. జీవకారుణ్యం ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం జంతు ప్రేమికులకు నీటి తొట్టెల పంపిణీ కార్యక్రమం భవానీపురం ఐరన్ యార్డ్‌లోని కార్యాలయం వద్ద నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ ఠాగూర్, మున్సిపల్ కార్పొరేషన్ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవిచంద్ర, పశుసంవర్థక శాఖ సర్జన్ డాక్టర్ శ్రీనివాసరావు విచ్చేశారు. జంతు ప్రేమికులు వేసవిలో వాటికి నీటిని అందించేందుకు సిమెంటు తొట్టెలను అందచేయడం అభినందనీయమన్నారు. జీవకారుణ్యం చైర్మన్ మురాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన పంపిణీ కార్యక్రమానికి విజయవాడలోని పలు ప్రాంతాల నుంచి పలువురు జంతుప్రేమికులు నీటి తొట్టెలను అందుకున్నారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఒత్తిడిని జయించినప్పుడే విజయాలను సొంతం చేసుకోగలరని సైకాలజిస్ట్ విజయరత్నం అన్నారు. ఎన్టీఆర్ జిల్లా యువజన సర్వీసు శాఖ ఆధ్వర్యంలో వన్‌టౌన్‌లోని పాదర్తి సుందరమ్మ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరత్నం మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన, క్రమశిక్షణ, పట్టుదల వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. పదో తరగతి చాలా కీలకమన్నారు. దీనిలో మంచి మార్కులను, జ్ఞానాన్ని సంపాదిస్తే అద్భుత విజయాలను అందుకోవచ్చన్నారు. పరీక్షల్లో ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. మరో సైకాలజిస్ట్ విజయలక్ష్మి మాట్లాడుతూ పది విద్యార్థులు చదువున్న అంశాలను ఎలా జ్ఞాపకం చేసుకోవాలో వివరించారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి పలు ఉదాహరణలు చెప్పారు. జిల్లా అసిస్టెంట్ మేనేజర్ నిమ్మగడ్డ నాగేశ్వరరావు కార్యక్రమాన్ని నిర్వహించారు.